


కెరటం నా ఆదర్శం
లేచి పడుతున్నందుకు కాదు,
పడినా లేస్తున్నందుకు...

Dr.PRK
# పవర్
పోరాడితే పోయెదేమి లేదు బానిస సంకెళ్ళు తప్ప



రామకృష్ణ హాస్పిటల్స్
పక్షవాతం, డిస్క్ సమస్యలు,
నడుమునొప్పి
మెడ నొప్పులకు
పూర్తి చికిత్స కలదు.
నిరుపేదలకు ఉచిత వైద్యం



రామకృష్ణ చారిటబుల్ ట్రస్ట్
విజయ టాకీస్ దగ్గర, హనుమాన్ టెంపుల్ లైన్, హనుమకొండ
సెల్: 9849485100



సంపుటి : 01 సంచిక : 350 | సోమవారం 28 సెప్టెంబర్ 2026 | పేజీలు : 4 | వెల : 4


# జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత

## మన్ కీ బాత్‌లో ప్రధాని మోడీ



### 2016 సర్జికల్ స్ట్రైక్స్‌ను గుర్తు చేసిన ప్రధాని

### ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన తప్పదు

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపుతామని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ఉగ్రవాదం విషయంలో భారత్ జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తోందని తెలిపారు. ఉగ్రవాదానికి బలమైన, నిర్ణయాత్మక ప్రతిస్పందన ఉంటుందనే విషయాన్ని భారత్ స్పష్టం చేసిందని తెలిపారు. 2016 పాకిస్థాన్‌లో ఉగ్రశిబిరాలపై భారత సైన్యం జరిపిన సర్జికల్ స్ట్రైక్స్ అందుకు నిదర్శనమని అని అన్నారు. గాంధీ జయంతి వేళ స్వచ్ఛతకు సంబంధించి ఆయన ఇచ్చిన నినాదాన్ని ముందుకు తీసుకెళ్లాలని మోదీ, ప్రజలను కోరారు. 138వ 'మన్ కీ బాత్'లో భాగంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఈ మేరకు మాట్లాడారు. భారత సైనికులు నియంత్రణ రేఖ దాటి ఉగ్రవాద స్థావరాలపై చర్యలు చేపట్టడం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైందని మోదీ అన్నారు. దేశం చాలా కాలంగా ఉగ్రదాడుల వల్ల ఎదుర్కొన్న బాధకు ఈ చర్య నిర్ణయాత్మక ప్రతిస్పందనగా నిలిచిందని పేర్కొన్నారు. పదేళ్ల క్రితం 2016లో చేపట్టిన సర్జికల్ స్ట్రైక్స్ ప్రపంచం ముందు భారత్ ఉగ్రవాద వ్యతిరేక విధానానికి ఒక కొత్త ఉదాహరణగా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. 2016 సెప్టెంబర్ 18న జమ్మూకశ్మీర్‌లోని ఉరీలో ఆర్మీ శిబిరంపై ఉగ్రదాడి జరిగింది. ఈ దాడికి ప్రతిస్పందనగా సెప్టెంబర్ 28-29 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి ఉగ్రవాదుల లాంచ్ ప్యాడ్‌లపై భారత సైన్యం సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది.

**జనగణనపై ప్రజలకు పిలుపు**

మన్ కీ బాత్‌లో దేశవ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రక్రియను కూడా ప్రధాని ప్రస్తావించారు. జనగణనను జాతీయ బాధ్యతగా అభివర్ణించారు. ప్రతి పౌరుడు ఇందులో భాగస్వామి కావాలని కోరారు. జనగణన సమయంలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ విధానాన్ని కూడా ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. దేశ జనాభా, సామాజిక-ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమాచార సేకరణలో పౌరుల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు.

**డ్రగ్స్‌కు వ్యతిరేకంగా యువత**

దేశంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు యువత ముందుకు రావడాన్ని ప్రధాని ప్రశంసించారు. 'నషా ముక్త్ యువ అభియాన్' ద్వారా యువత అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తోందన్నారు. యువత తమంతట తామే మాదకద్రవ్యాలకు ..మిగతా 2లో



# ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా'

### ఐదు లక్షల బీమా అందజేయనున్నట్లు ప్రకటించిన భట్టి

### రైతులకు రుణమాఫీతో పాటు ఎకరాకు 12, సాయం

### కాంగ్రెస్ బూత్ లెవెల్ ఏజెంట్లే పార్టీకి మూల స్తంభాలు

### ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

**మధిర, పవర్ న్యూస్**

కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లే బూత్ లెవెల్ ఏజెంట్లే (బిఎల్‌ఏలు) పార్టీకి నిజమైన మూలస్తంభాలని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ గ్రామంలో ఆదివారం నిర్వహించిన మండల కాంగ్రెస్ బిఎల్‌ఏల ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామ స్థాయిలో కష్టపడే ప్రతి కార్యకర్త శ్రమకు తగిన గౌరవం లభిస్తుందని,ప్రభుత్వ పథకాలను ప్రతి ఇంటికి చేర్చి ప్రజా పాలనకు మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత బిఎల్‌ఏలపైనే ఉందన్నారు.గత 10 ఏళ్లలో ప్రభుత్వం లేకపోవడం వల్ల మధిర నియోజకవర్గంలో అభివృద్ధి వెనుకబడిందని, కేవలం ఈ 5 ఏళ్ల కాలంలోనే కాలంతో పోటీ పడి పెండింగ్ పనులను పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. రాబోయే రెండేళ్లలో పాఠశాలలు, రోడ్లు, ఆసుపత్రులు వంటి అన్ని పనులను వేగవంతంగా పూర్తి చేసి నాయకులు గ్రామాల్లో తలఎత్తుకొని తిరిగేలా చేస్తామని స్పష్టం చేశారు.ఈ ..మిగతా 2లో

## మేడారం మినీ జాతర

# తేదీలు వచ్చేశాయ్..

### 4 రోజుల పాటు ఉత్సవాలు, పూర్తి షెడ్యూల్ ఇదే..!



**హైదరాబాద్, పవర్ న్యూస్**

మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతర 2027 తేదీలు ఖరారు అయ్యాయి. ఫిబ్రవరి 17 నుంచి 20 వరకు 4 రోజుల పాటు మినీ జాతర నిర్వహించనున్నట్లు పూజారులు షెడ్యూల్ విడుదల చేశారు. ఫిబ్రవరి 17న సారలమ్మను గద్దెపైకి తీసుకురావడం, 18న సమ్మక్కను గద్దెపైకి తీసుకురావడం, 19న భక్తులు దర్శనాలు, మొక్కులు.. 20న జాతర ముగుస్తుంది. మహాజాతర లేని ఏడాదిలో జరిగే ఈ మినీ జాతరకు భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో అధికారులు దానికి సంబంధించిన ..మిగతా 2లో




# బ్యాంకు ఉద్యోగుల సమ్మె వాయిదా

**న్యూఢిల్లీ, పవర్ న్యూస్**

ప్రభుత్వ రంగ బ్యాంకుల ఉద్యోగులు ఈ నెల 28, 29, 30 తేదీల్లో మూడు రోజులపాటు నిర్వహించాల్సిన సమ్మె వాయిదా పడింది. ఐబీఐ, యూఎఫ్‌బీయూ మధ్య ఆదివారం సమావేశం జరిగింది. చర్చలు ఫలించడంతో బ్యాంకు యూనియన్లు సమ్మె విరమణ ప్రకటన చేశాయి. శనివారాల సెలవు డిమాండ్‌పై ఉన్నతస్థాయి కమిటీ ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. సమ్మె వాయిదా పడడంతో సోమవారం నుంచి బ్యాంకులు యథావిధిగా పనిచేస్తాయి.

# కేసీఆర్ కేటీఆర్ హరీశ్ రావు తాత మధు సభ్యత్వాలపై చట్టబద్ధ పోరాటం కొనసాగిస్తాం

### భారత రాష్ట్ర సమితి పార్టీని రద్దు చేయాలి : డాక్టర్ రామకృష్ణ పెరుమాండ్ల

**(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 27)**

దళితుల గౌరవం, ఆత్మగౌరవం, రాజ్యాంగ హక్కుల పరిరక్షణ విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదని మాదిగ హక్కుల దండోరా నాయకులు స్పష్టం చేశారు.భారత రాష్ట్ర సమితి పార్టీ గుర్తింపును రద్దు చేయాలని మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు రెగుంట సునీల్ మాదిగ సమర్పించిన వినతిని తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం రెండు వేల ఇరవై ఆరు సెప్టెంబర్ ఇరవై రెండవ తేదీన అవసరమైన చర్యల కోసం ప్రధాన ఎన్నికల అధికారికి పంపింది. కేసీఆర్ ఇంటి దగ్గర పసుపు నీళ్ల శుద్ధి మరియు స్పీకర్ మీద అభ్యంతర పదజాలం వాడటం వలన తగిన చర్యలు తీసుకోవాలని ఆ వినతిలో కోరారు.రాజ్యాంగం అందరికీ సమాన గౌరవం, సమాన హక్కులు కల్పిస్తున్న నేపథ్యంలో దళితులపై అవమానకరమైన వ్యాఖ్యలు, కుల వివక్ష, అంటరానితనాన్ని ప్రోత్సహించే చర్యలు లేదా దళితుల హక్కులకు భంగం కలిగించే ఘటనలపై పదవులు, పార్టీలు, రాజకీయ స్థాయి చూడకుండా చట్టపరమైన చర్యలు జరగాలని వారు డిమాండ్ చేశారు.కల్వకుంట్ల చంద్రశేఖర రావు, కల్వకుంట్ల తారక రామారావు, హరీశ్‌రావు, తాత మధు తదితర ప్రజాప్రతినిధులపై తమ వినతిలో పేర్కొన్న అంశాలను సంబంధిత రాజ్యాంగ, చట్టబద్ధ సంస్థలు స్వతంత్రంగా పరిశీలించి చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భారత రాష్ట్ర సమితి పార్టీ గుర్తింపు విషయంలో సంబంధిత ఎన్నికల చట్టాలు, నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకుని పార్టీని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీల గుర్తింపునకు సంబంధించిన అధికారాలు నిబంధనల పరిధిలో ఉంటాయని గుర్తుచేశారు.గద్వాల ప్రేమవివాహం విషయంలో దళితుని ఇల్లు కూల్చివేసిన ఘటన, సిద్దిపేటలో వినాయక భోజనంలో దళితులకు వేరే వరుస పెట్టడం, కరీంనగర్ సుల్తానాబాద్‌లో దళితుడిని బట్టలు లేకుండా చేసి తీవ్రంగా కొట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, నిందితులను వదిలిపెట్టమని డాక్టర్ రామకృష్ణ మండిపడ్డారు.దళితులపై ఎక్కడ, ఎవరి ద్వారా అన్యాయం జరిగినా మాదిగ హక్కుల దండోరా చట్టబద్ధంగా బాధితుల పక్షాన నిలబడుతుంది. ఉద్యోగి అయినా, ప్రజాప్రతినిధి అయినా, వ్యాపారవేత్త అయినా, సామాన్య వ్యక్తి అయినా కులం పేరుతో అవమానించడం, దాడి చేయడం, బెదిరించడం, భూములు ఆక్రమించడం వంటి ఆరోపణలు వస్తే సంబంధిత అధికారులను ఆశ్రయించి, న్యాయం జరిగే వరకు చట్టపరమైన పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.దళితుల ఆత్మగౌరవం మా హక్కు, రాజ్యాంగమే మా ఆయుధం. అన్యాయంపై రాజీ లేదు, చట్టపరమైన పోరాటం ఆగదు.



**డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ**
**రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాదిగ హక్కుల దండోరా**
**రెగుంట సునీల్ మాదిగ**
**రాష్ట్ర అధ్యక్షులు, మాదిగ హక్కుల దండోరా**

# జనగణన ప్రతి ఒక్కరి బాధ్యత

మొదటి పేజీ తరువాయి...
దూరంగా ఉండాలని ప్రతిజ్ఞ చేయడంతో పాటు, ఇతరులను కూడా ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారని మోదీ చెప్పారు. 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో దేశవ్యాప్తంగా యువత భాగస్వామ్యం పెరుగుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం ఇటీవల వెల్లడించింది.

**మోధేరా గ్రామం ప్రస్తావన**

గుజరాత్‌లోని చారిత్రాత్మక మోధేరా సూర్య దేవాలయం వెయ్యేళ్ల ప్రస్థానాన్ని ప్రధాని మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. విదేశీ దండయాత్రల సమయంలో ఈ ఆలయం ఎదుర్కొన్న విధ్వంసాన్ని, ఆ తర్వాత జరిగిన పునర్నిర్మాణాన్ని గుర్తు చేసుకున్నారు. అదే సమయంలో, ఈ గ్రామం దేశంలోనే మొట్టమొదటి 24ఇ7 సోలార్ విలేజ్‌గా మారడాన్ని ఆయన అభినందించారు.

అలాగే మోధేరాలో పర్యాటకుల కోసం అనేక వసతులను పెంచినట్లు ప్రధాని తెలిపారు. ఏటా జనవరిలో మకర సంక్రాంతి తర్వాత ఇక్కడ జరిగే 'మోధేరా నృత్య ఉత్సవం'లో భారతీయ శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా



నిలుస్తాయన్నారు. భారతీయులందరూ జీవితంలో ఒక్కసారైనా మోధేరాను సందర్శించాలని ఆయన కోరారు.

మధ్యప్రదేశ్‌లో ఓ యువకుడు నది పరిశుభ్రత చేపడితే సమాజం మొత్తం అండగా నిలిచిందని ప్రధాని మోదీ చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా పురాతన బావులు, కోనేరులకు పునర్ వైభవం తీసుకొచ్చే దిశగా పరిశుభ్రత కార్యక్రమాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఢిల్లీలో యువత పొడి, తడి చెత్తను వేర్వేరుగా సేకరించే కార్యక్రమాలు చేపట్టారని వివరించారు. జనగణన కార్యక్రమాన్ని బాధ్యతగా తీసుకొని ప్రతి పౌరుడు అందులో పాల్గొనాలని మోదీ పిలుపునిచ్చారు.

**అశోక్ సింఘాల్‌కు నివాళి**

విశ్వ హిందూ పరిషత్ మాజీ నేత అశోక్ సింఘాల్ జయంతి సందర్భంగా ప్రధాని మోదీ ఆయనను స్మరించుకున్నారు. సమాజంలో ఉంటూనే సన్యాసిలా జీవితం గడిపారని పేర్కొన్నారు. రామజన్మభూమి ఉద్యమానికి సింఘాల్ అందించిన దిశ, అందులో ఆయన నింపిన శక్తిని మోదీ ప్రస్తావించారు. అయోధ్యలో నిర్మితమైన రామ మందిరాన్ని ఆయన కృషికి ఫలితంగా అభివర్ణించారు.



## 12 నుంచి బ్రహ్మోత్సవాలు

పెద్దశేష వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 13 -- చిన్నశేష వాహనం -- ఉదయం 8 గంటలకు
హంస వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 14 -- సింహ వాహనం -- ఉదయం 8 గంటలకు
ముత్యపుపందిరి వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 15 -- కల్పవృక్ష వాహనం -- ఉదయం 8 గంటలకు
సర్వభూపాల వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 16 -- మోహినీ అవతారం -- ఉదయం 8 గంటలకు
గరుడ వాహనం -- సాయంత్రం 6.30 గంటలకు
అక్టోబరు 17 -- హనుమంత వాహనం -- ఉదయం 8 గంటలకు
పుష్పక విమానం -- సాయంత్రం 4 గంటలకు
గజ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 18 -- సూర్యప్రభ వాహనం -- ఉదయం 8 గంటలకు
చంద్రప్రభ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 19 -- స్వర్ణరథం -- ఉదయం 7 గంటలకు
అశ్వ వాహనం -- రాత్రి 7 గంటలకు
అక్టోబరు 20 -- చక్రస్నానం -- ఉదయం 6 గంటలకు



## మేడారం మినీ జాతర తేదీలు వచ్చేశాయ్..

మొదటి పేజీ తరువాయి...
ఏర్పాట్లు చేయనున్నారు.

**మేడారం మినీ జాతర 2027 షెడ్యూల్ విడుదల**

తెలంగాణలో ప్రసిద్ధిగాంచిన మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు సంబంధించి వచ్చే ఏడాది షెడ్యూల్ విడుదలైంది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో 2027 ఫిబ్రవరి నెలలో నాలుగు రోజుల పాటు మినీ జాతర నిర్వహించనున్నట్లు సమ్మక్క-సారలమ్మ పూజారుల సంఘం ప్రకటించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 17వ వతేదీ నుంచి 20వ తేదీ వరకు ఉత్సవాలు కొనసాగనున్నాయని పేర్కొంది. మేడారం మినీ జాతర తేదీలను పూజారుల సంఘం తాజాగా అధికారికంగా ప్రకటించింది. ఈ వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి కూడా తెలియజేసింది. మినీ జాతర సందర్భంగా సమ్మక్క-సారలమ్మ అమ్మవార్లను సంప్రదాయబద్ధంగా గద్దెలపైకి తీసుకొచ్చి పూజలు నిర్వహించనున్నారు.

మినీ జాతరలో నాలుగు రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పూజారులు వెల్లడించిన షెడ్యూల్ ప్రకారం.. తొలిరోజైన ఫిబ్రవరి 17వ తేదీన మేడారం మినీ జాతర ప్రారంభం కానుంది. తొలి రోజు సారలమ్మను గద్దెపైకి తీసుకురానున్నారు. సంప్రదాయ పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు ప్రారంభించనున్నారు. ఇక రెండో రోజైన ఫిబ్రవరి 18వ తేదీన సమ్మక్కను గద్దెపైకి తీసుకురానున్నారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు మేడారం చేరుకుని అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉంది.

## సిరిసిల్లలో బిఆర్ఎస్ కబ్జాలపై... శ్వేత పత్రానికి డిమాండ్

సిరిసిల్లలో బీఆర్ఎస్ నేతలు 8 వేల ఎకరాల భూమిని దోచుకున్నారని, అందులో 2,400 ఎకరాలు స్వాధీనం చేసుకున్నామని చెప్పడం నిరాధారమని కేటీఆర్ అన్నారు. 2014 నుంచి 2023 వరకు జిల్లాలో కేవలం 1,272 ఎకరాల భూ పంపిణీ జరిగిందని, అందులో సిరిసిల్ల నియోజకవర్గంలో 204 ఎకరాలు మాత్రమేనని స్పష్టం చేశారు. "ఆ 8 వేల ఎకరాల భూమి ఎక్కడుంది స్వాధీనం చేసుకున్న 2,400 ఎకరాలు ఏ మండలం, ఏ గ్రామం, ఏ సర్వే నంబర్‌లో ఉన్నాయి,ఆ వివరాలతో తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలి. రుజువు చేయలేకపోతే సిరిసిల్ల ప్రజలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలి" అని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**నేతన్నల బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు.**

బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మ చీరలు, స్కూల్ యూనిఫాంలు, ఇతర ప్రభుత్వ ఆర్డర్లతో నేతన్నలకు రూ.3,313 కోట్ల విలువైన పని కల్పించి, వారి ఆదాయాన్ని రూ.20 వేలకు పెంచామని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం బతుకమ్మ చీరల పథకాన్ని నిలిపివేసి, ఇతర ఆర్డర్లను దళారులకు కట్టబెట్టి నేతన్నల ఉపాధిని దెబ్బతీసిందని ఆరోపించారు.

"నేతన్నల బకాయిలు రూ.60 కోట్లు ఎప్పుడు చెల్లిస్తారు? నిలిపివేసిన 10 శాతం యార్న్ సబ్సిడీ, రూ.5 లక్షల నేతన్న బీమా ఎప్పుడు పునరుద్ధరిస్తారు తేదీలు ప్రకటించాలని ప్రశ్నించారు. వీవింగ్ పార్క్, అపరెల్ పార్క్ ప్రారంభించి కార్మికులను యజమానులుగా మార్చే ప్రణాళికలను ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని నిలదీశారు.

**రైతన్నకు ఇచ్చిన మాట ఏమైంది**

రైతుబంధును రూ.15 వేలకు పెంచుతామని, కౌలు రైతులకు కూడా ఇస్తామని హామీ ఇచ్చి ఎందుకు అమలు చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. "ఎగ్గొట్టిన రైతుబంధు బకాయిలు, రూ.2 లక్షల రుణమాఫీ సంపూర్ణ అమలు, నిలిచిపోయిన రైతుబీమా పునరుద్ధరణ ఎప్పుడు చేస్తారు. స్పష్టమైన తేదీలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో రూ.1,604 కోట్లతో చేపట్టిన మల్కపేట రిజర్వాయర్ నుంచి అప్పర్ మానేరుకు నీటిని ఎప్పుడు తరలిస్తారో చెప్పాలన్నారు.

అభివృద్ధి, విద్య, సంక్షేమంపై ప్రశ్నల వర్షం

బీఆర్ఎస్ హయాంలో సిరిసిల్లను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, రూ.400 కోట్లతో మంజూరైన జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కాలేజీకి నిధులు ఎందుకు విడుదల చేయడం లేదని కేటీఆర్ ప్రశ్నించారు. రూ.1,564 కోట్లతో సిరిసిల్ల పట్టణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.40 కోట్ల బకాయిలు విడుదల చేయాలని కోరారు.

ఆసరా పెన్షన్లను రూ.4 వేలకు ఎప్పుడు పెంచుతారని, 33 నెలలుగా మహిళలకు బాకీ ఉన్న రూ.82,500 మహాలక్ష్మి సాయం, కల్యాణలక్ష్మి తులం బంగారం హామీ ఏమైందని నిలదీశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యార్థినులకు స్కూటీలు, ఆటో డ్రైవర్లకు రూ.12 వేల సాయం వంటి హామీల అమలుపై స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో చేర్చే హామీ, నిలిపివేసిన గొర్రెల పంపిణీ, చేపపిల్లల పంపిణీ, దళితబంధు, బీసీబంధు పథకాలను ఎప్పుడు పునరుద్ధరిస్తారో చెప్పాలని కోరారు. చైతన్యానికి ప్రతీక అయిన సిరిసిల్ల గడ్డపైకి వస్తున్న ముఖ్యమంత్రి, ప్రజల పక్షాన తాము లేవనెత్తిన ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం చెప్పి, తన పర్యటనకు సార్థకత చేకూర్చాలని కేటీఆర్ తన లేఖలో పేర్కొన్నారు.

## ప్రపంచ టూరిజం డెస్టినేషన్‌గా తెలంగాణ

### పెట్టుబడులకు కొత్త పాలసీ..

### సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన

హైదరాబాద్, సెప్టెంబర్ 27

వరల్డ్ టూరిజం డే సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అడవులు, వన్యప్రాణి ప్రాంతాలు, జానపద కళలు, పండుగలను ప్రపంచ పర్యాటక పటంలో మరింతగా పరిచయం చేయాలని తమ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. రామప్ప, వరంగల్, యాదాద్రి, భద్రాద్రి, అలంపూర్, మేడారం, హైదరాబాద్ హెరిటేజ్ ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. టూరిజం పాలసీ 2025-30 ద్వారా పెట్టుబడులను ఆకర్షిస్తూ ఎకో, టెంపుల్, మెడికల్, హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా తెలంగాణ ప్రజలకు, రాష్ట్రాన్ని సందర్శిస్తున్న దేశ, విదేశీ పర్యాటకులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలోని సహజ, సాంస్కృతిక, చారిత్రక, ఆధ్యాత్మిక ప్రత్యేకతలను ప్రపంచానికి మరింతగా పరిచయం చేయడంతో పాటు రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి పర్యాటక గమ్యస్థానంగా అభివృద్ధి చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణకు అనేక రకాల పర్యాటక ఆకర్షణలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.చారిత్రక కట్టడాలు, పురాతన దేవాలయాలు, కోటలు, జలపాతాలు, అడవులు, వన్యప్రాణి అభయారణ్యాలు, చెరువులు, జానపద కళలు, సంప్రదాయ పండుగలు తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతను చాటుతున్నాయని తెలిపారు. ఈ ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసి మరింత మంది దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. తెలంగాణలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు.



## ప్రతి కుటుంబానికి 'ఇందిరమ్మ బీమా'

మొదటి పేజీ తరువాయి...
సందర్భంగా ప్రజా సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. రాష్ట్రంలో కోటి 6 లక్షల కుటుంబాలకు నెలకు 6 కేజీల చొప్పున ఉచితంగా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో పాటు డ్వాక్రా రుణాల పునరుద్ధరణ చేపడుతున్నామన్నారు.గృహ జ్యోతి కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచామని చెప్పారు. నవంబర్ 19న ప్రతి కుటుంబానికి రూ. 5 లక్షల బీమా కల్పించే 'ఇందిరమ్మ ధీమా' పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా అల్పాహారం,పాలు, రాగిజావ అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్'ను నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇదే పర్యటనలో భాగంగా చింతకాని మండల కేంద్రంలో పర్యాటక రంగానికి పెద్దపీట వేసేలా కీలక అభివృద్ధి పనులకు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క శ్రీకారం చుట్టారు. మండల కేంద్రంలోని చెరువు వద్ద పర్యాటక వసతుల కల్పన పనులకు శంకుస్థాపన చేసి, మౌలిక వసతుల డిజైన్లను పరిశీలించారు.సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆధునిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అలాగే,నరసింహాపురం ఎస్సీ కాలనీలో అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు.కాలనీ వాసుల దీర్ఘకాలిక సమస్యను పరిష్కరిస్తూ నాణ్యమైన రోడ్లను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్,టీపీసీసీ పరిశీలకులు దుద్దిళ్ల శ్రీను బాబు,డీసీసీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## దేశంలో తొలి ఎల్‌ఎన్‌జీ రైలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 27

భారత రైల్వే చరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభమైంది. దేశంలోనే తొలిసారిగా ద్రవీకృత సహజ వాయువు ఇంధనంతో నడిచే రైలును కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, గుజరాత్ ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ ఆదివారం సబర్మతిలో జెండా ఊపి ప్రారంభించారు. రైల్వే కార్యకలాపాల్లో డీజిల్‌కు ప్రత్యామ్నాయంగా ఎల్‌ఎన్‌జీ వాడకానికి ఈ కార్యక్రమం శ్రీకారం చుట్టింది. సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరులను ప్రోత్సహించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. ఇందుకోసం డ్రైవింగ్ పవర్ కార్స్ ఇంజిన్లను డీజిల్-ప్లస్-ఎల్‌ఎన్‌జీ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్‌గా అభివృద్ధి చేశారు. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలో 1,400 హార్స్‌పవర్ సామర్థ్యం గల రెండు డీపీసీలను ఈ కొత్త విధానానికి మార్చారు. ఈ టెక్నాలజీ పనితీరును నిర్ధారించుకునేందుకు, మార్పిడి చేసిన రెండు డీపీసీలపై 2,000 కిలోమీటర్లకు పైగా ఫీల్డ్ ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశారు.రైల్వే శాఖ విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఈ డ్యూయల్-ఫ్యూయల్ సిస్టమ్ ద్వారా డీజిల్ వాడకాన్ని 40 శాతం వరకు తగ్గించవచ్చు. దీనివల్ల ఇంధన ఖర్చు గణనీయంగా ఆదా అవ్వడంతో పాటు కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ల వంటి కాలుష్య కారకాల ఉద్గారాలు కూడా తగ్గుతాయి. ఒక డీపీసీపై ఏటా రూ.11.9 లక్షలు, ఎనిమిది కోచ్‌ల రైలుపై సుమారు రూ.23.9 లక్షల వరకు ఆదా అవుతుందని రైల్వే శాఖ అంచనా వేసింది.ప్రతి డీపీసీలో 2,200 లీటర్ల సామర్థ్యంతో కూడిన ఎల్‌ఎన్‌జీ ట్యాంకును అమర్చారు. ఇందులో 850-900 కిలోల వరకు ఎల్‌ఎన్‌జీని నింపవచ్చు. ఒక్కసారి ట్యాంకును పూర్తిగా నింపితే రైలు సుమారు 1,600 కిలోమీటర్ల వరకు ప్రయాణిస్తుంది.ఈ పర్యటనలో భాగంగా అమిత్ షా రూ.1,542 కోట్లకు పైగా విలువైన పలు రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించారు. ఇందులో భాగంగా సబర్మతిలో రూ.700 కోట్లతో నిర్మించిన లోకోమోటివ్ నిర్వహణ షెడ్‌ను ప్రారంభించి, ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్‌ను జెండా ఊపి పంపించారు. వీటితో పాటు అహ్మదాబాద్- పాలన్‌పూర్, అహ్మదాబాద్-సమఖియాలీ సెక్షన్లలో దేశీయ పరిజ్ఞానంతో తయారైన 'కవచ్' రైలు రక్షణ వ్యవస్థను, రెండు రైల్వే సెక్షన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను, సబర్మతి-సర్ఖేజ్ సెక్షన్ డబ్లింగ్ పనులను కూడా ప్రారంభించారు. రైలు పనితీరుకు ఎలాంటి ఆటంకం లేకుండా ఖర్చులను, కాలుష్యాన్ని తగ్గించేందుకు రైల్వే శాఖ చేస్తున్న ప్రయోగాలకు ఈ ఎల్‌ఎన్‌జీ రైలు నిదర్శనంగా నిలుస్తోంది.

## తెలంగాణలో ULC పెండింగ్ దరఖాస్తులకు మోక్షం

### దశాబ్దాల భూ సమస్యలపై సర్కారు ఫోకస్

### తెలంగాణలో 22ఏ భూములపై హై లెవల్ కమిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 27

రాష్ట్రంలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారంపై తెలంగాణ ప్రభుత్వం దృష్టి సారించింది. అర్బన్ ల్యాండ్ సీలింగ్ కింద పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న దరఖాస్తులను పరిశీలించి, అర్హమైన కేసులను నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన విడుదల చేశారు. దశాబ్దాలుగా పరిష్కారం కాకుండా ఉన్న భూ వివాదాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వెల్లడించారు. ఖూజ పెండింగ్ దరఖాస్తులకు సంబంధించి గతంలో జారీ చేసిన ఉత్తర్వుల అమలులో జాప్యం జరిగిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. 2016లో జీవోలు జారీ చేసినప్పటికీ అప్పట్లో వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉండిపోయాయని తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

**ఎమ్మెల్యే నాయిని
బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి
ఆయన సేవలు చిరస్మరణీయం:
ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన సేవలు చిరస్మరణీయం: ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**



(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 27)

కొండా లక్ష్మణ్ బాపూజీ 111వ జయంతి వేడుకలను హనుమకొండ జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు కూరపాటి వెంకట నారాయణ, సంగం వెంకట్రాజం పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, కార్పొరేషన్ చైర్మన్లు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ తన జీవితాన్ని ప్రజల కోసం, ముఖ్యంగా వెనకబడిన వర్గాల అభ్యున్నతి కోసం అంకితం చేసిన మహనీయుడని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించడంతో పాటు తెలంగాణ ప్రజల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం చిరస్మరణీయమని పేర్కొన్నారు.బడుగు, బలహీన వర్గాలకు సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పించాలన్న బాపూజీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీ చూపిన మార్గంలో నడుస్తూ వెనకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఆయన సేవలు, త్యాగాలు భావితరాలకు ఎప్పటికీ స్ఫూర్తిగా నిలుస్తాయని అన్నారు.

# జయశ్రీకి న్యాయం జరిగే వరకు పోరాడుతాం

**- ఆరో రోజుకు చేరిన నిరసనలు గూడూరు జయశ్రీని బంధించడం మానవ హక్కుల ఉల్లంఘనే**
**- వెంటనే జిల్లా కలెక్టర్ శాసనసభ్యులు పోలీసు కమిషనర్ దృష్టి సారించాలి**
**- అత్త మీరాబాయిపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- జయశ్రీకి గతంలో రాసిచ్చిన ఇల్లు ఆస్తులు ఇప్పించాలి**
**- వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు**
**- సంయుక్త కార్యాచరణ కమిటీ చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 27)

అత్త మీరాబాయి వలన వేధింపులకు గురై అక్రమంగా ఇంట్లో బంధించబడి ఆరు రోజులుగా నరకయాతన పడుతున్న గూడూరు జయశ్రీకి మరియు ఆమె కూతురు తేజస్వినికి న్యాయం జరిగే వరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పోరాడుతామని వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు సంయుక్త కార్యాచరణ కమిటీ ములుగు జిల్లా చైర్మన్ ముంజాల బిక్షపతి గౌడ్ స్పష్టం చేశారు. పోలీసుల కళ్ళముందే గూడూరు జయశ్రీతో పాటు ఆమె కూతురు తేజస్వినిని అక్రమంగా ఇంట్లో బంధించి తాళం వేయడం మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుందని ఆయన తెలిపారు.జయశ్రీ కుటుంబానికి న్యాయం చేయాలని ఆమె కుమారుడు కార్తీకేయ చేస్తున్న నిరసనలు శనివారం ఆరో రోజుకు చేరాయని, ఆరు రోజులుగా బాధితులు








తిండి, నిద్ర లేక నరకయాతన అనుభవిస్తున్నారని అన్నారు. ఈ విషయంపై వెంటనే జిల్లా కలెక్టర్ చాహాత్ బాజ్ పాయ్, స్థానిక శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి, పోలీసు కమిషనర్ శ్వేత దృష్టి సారించి జయశ్రీ అత్త మీరాబాయిపై, ఆమెకు సహకరించిన కూతుర్లు, అల్లుండ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, గతంలో జయశ్రీకి రాసిచ్చిన ఇల్లు, ఆస్తులను వెంటనే ఇప్పించాలని డిమాండ్ చేశారు. జయశ్రీకి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు మాదిగ జాగృతి సంస్థ ములుగు జిల్లా కన్వీనర్ సాంబశివ, వెనుకబడిన తరగతులు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు ములుగు జిల్లా కన్వీనర్ సాగర్, నాయకులు కట్టయ్య, రవిందర్, కరుణాకర్, యాకుబ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



# అసైన్డ్ భూ రక్షణ సమితి నూతన కమిటీ ఏర్పాటు

(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 27)

ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ భూ రక్షణ సమితి హనుమకొండ జిల్లా అధ్యక్షులు పాముల రమేష్ ఆదేశానుసారం ఆత్మకూరు గ్రామంలో అసైన్డ్ భూముల పట్టాల విషయమై అసైన్డ్ భూములు కలిగిన రైతులు అసైన్డ్ భూ రక్షణ సమితి కమిటీని ఎన్నుకున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసైన్డ్ భూములకు పట్టా పాస్ పుస్తకాలు ఇస్తామని తెలిపినందున, ఆత్మకూరు అసైన్డ్ భూముల కమిటీ అధ్యక్షులుగా కోగిల సారంగపాణి, ఉపాధ్యక్షులుగా మంద రవిని ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా ఎన్నికైన నూతన కమిటీ సభ్యులకు అధ్యక్ష ఉపాధ్యక్షులు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ముఖ్యమంత్రి వీలైనంత త్వరగా అసైన్డ్ భూములు కలిగిన ప్రతి రైతుకూ పట్టాదారు పాస్ పుస్తకాలు ఇచ్చి, వారికి రైతు భరోసా, రైతు బీమా వంటి సంక్షేమ పథకాలు అందే విధంగా భరోసా కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కోకిల మొగిలి, నాగవెల్లి కొమురయ్య, పరికి సారయ్య, జెన్ను సాంబయ్య, కొమ్ము రమేష్, పెరుమాండ్ల రవి, పెరుమాండ్ల రాజు, మంద చంద్రమోహన్, కోగిల అశోక్, కోకిల రవి, నాగవెల్లి స్వామి, నత్తి రవి, తనుగుల వీరస్వామి, జన్నారపు మొగిలి, నత్తి రవీందర్, తణుగుల రామానుజన్ తదితరులు పాల్గొన్నారు.

# వర్ధన్నపేట నియోజకవర్గంలో పలువురి పరామర్శ

**మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్**

(వర్ధన్నపేట -- పవర్, సెప్టెంబర్ 27)

వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని కట్ర్యాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ తీగల కుమారస్వామి గౌడ్ ఇటీవల మరణించగా, నేడు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు అరూరి రమేష్ పరామర్శించారు.
అనంతరం అదే గ్రామానికి చెందిన సీనియర్ నాయకులు బీరవెల్లి లింగమూర్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలుసుకొని, వారిని నేరుగా కలిసి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గుజ్జు సంపత్ రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ టెరిటోరియల్ నియోజకవర్గ సభ్యులు మార్గం బిక్షపతి, మాజీ మండల పార్టీ అధ్యక్షులు తుళ్ల కుమార్, రామోజీ కమ్మరిగూడెం తిరుపతి మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# విశ్వనాథపురంలో ఫుడ్ మార్కెట్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేసిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి

(గీసుగొండ -- పవర్, సెప్టెంబర్ 27)



గీసుగొండ మండలంలోని విశ్వనాథపురం గ్రామంలో ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేయడానికి అనుకూలమైన ప్రాంతాన్ని, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఏ. ప్రియాంక అనిల్ గార్లతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పరిశీలించారు.రైతులు, వ్యాపారులు, స్థానిక ప్రజలకు ప్రయోజనం కలిగే విధంగా ఫుడ్ మార్కెట్ ఏర్పాటు చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, మార్కెటింగ్ వసతులు తదితర అంశాలను అధికారులు పరిశీలించారు. ఫుడ్ మార్కెట్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంత రైతులకు మెరుగైన మార్కెటింగ్ సౌకర్యాలు అందడంతో పాటు, స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరగడం, వ్యాపార కార్యకలాపాలకు మరింత ప్రోత్సాహం లభించే అవకాశం ఉందని వారు అన్నారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**-- గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద బాపూజీ విగ్రహానికి నివాళు లర్పించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 27)



వరంగల్ గోపాలస్వామి గుడి జంక్షన్ వద్ద కొండా లక్ష్మణ్ బాపూజీ గారి జయంతిని పురస్కరించుకుని, వారి విగ్రహానికి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య గారు, కుడా చైర్మన్ గుండు సుధారాణి గారు, జిల్లా కలెక్టర్ సత్య శారద గారితో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి .ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ దేశం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం చేసిన అమూల్యమైన సేవలను నాయకులు స్మరించుకుంటూ ఘనంగా నివాళులు అర్పించారు.

# యాదగిరిగుట్టలో ఘనంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం డిమాండ్**

(యాదగిరిగుట్ట/ఆత్మకూరు - పవర్,సెప్టెంబర్ 27 )



తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆవిర్భావ దినోత్సవ వేడుకలు యాదగిరిగుట్టలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సమావేశానికి ఆత్మకూరు, దామెర మండలాల నుండి తెలంగాణ ఉద్యమకారులు భారీ సంఖ్యలో తరలివెళ్లారు.

**ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి:**

ఈ వేడుకల్లో హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం పాల్గొని మాట్లాడుతూ... 2023 శాసనసభ ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యమకారుల త్యాగాలను గుర్తించి వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు.

**పాల్గొన్న ఉద్యమకారులు:**

ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం దామెర, ఆత్మకూరు మండలాల అధ్యక్షులు ఎండి బాబు మియా, పోలేపాక ఆరోగ్యం, జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి గోవిందు అశోక్, సర్పంచులు పెరుక సత్యం, అంకతి రవి, రాయరాకుల రవీందర్, మండల ప్రధాన కార్యదర్శి దొంక రాజన్న, దండు రాజు, మోరే మహేందర్, గోవింద ప్రభాకర్, కుంట మల్లరాజు, సారారాజు, బుస్సా ఐలయ్య, దండు భాస్కర్, శోభన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన కుటుంబాలను పరామర్శించిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి

(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 27)

హన్మకొండ జిల్లా పరకాల నియోజకవర్గంలోని ఆత్మకూరు మండలంలో అనారోగ్యంతో మృతి చెందిన పలువురి కుటుంబాలను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాష్ రెడ్డి పరామర్శించారు. ఆత్మకూరు మండలంలోని నాగయ్యపల్లె గ్రామానికి చెందిన మాదాసి సూరయ్య, పెద్దాపురం గ్రామానికి చెందిన నామిని కళావతి, కొమ్ముల జయ మరియు చాపర్తి సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న శాసనసభ్యులు వారి నివాసాలకు వెళ్లి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు మరియు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని, వారి ప్రతి కష్టసుఖాలలోనూ పార్టీ తరపున అండగా ఉంటుందని భరోసా కల్పించారు.



ఈ పరామర్శ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, సమన్వయ కమిటీ సభ్యులు, సర్పంచులు, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాలలో ప్రపంచ బధిరుల దినోత్సవం

(హన్మకొండ-- పవర్, సెప్టెంబర్ 27)

ప్రపంచ బధిరుల దినోత్సవం సందర్భంగా వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కందుకూరి.పూజ ఆధ్వర్యంలో శ్రీ వెంకటేశ్వర బధిరుల పాఠశాల, హనుమకొండలోని వినికిడి లోపం గల విద్యార్థులకు , వరంగల్, హనుమకొండ జిల్లాల వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు డాక్టర్ బి రాజా రెడ్డి, డా.అప్పయ్య, మెడికవర్ హాస్పిటల్, సహకారంతో ఉచిత వైద్య, ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి.బి.నిర్మలా గీతాంబ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కార్యదర్శి కందుకూరి పూజ, వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి బి. రాజారెడ్డి, వరంగల్ జిల్లా సంక్షేమ శాఖ అధికారి బి.రాజమణి, లీగల్ ఎయిడ్ కౌన్సెల్ పి.శ్రీనివాసరావు, పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీ, డా.అనిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. శిబిరంలోని డాక్టర్లు విద్యార్థులకు అవసరమైన వైద్య పరీక్షలు, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సంబంధిత వైద్య సలహాలు అందించారు. వినికిడి లోపం గల విద్యార్థులకు సమాన ఆరోగ్య సేవలు, విద్యా అవకాశాలు, న్యాయ సహాయం మరియు వారి హక్కులపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని ప్రధాన న్యాయమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అందించే దివ్యాంగజన్ కౌశల్ వికాస్ ద్వారా దివ్యాంగులకు నైపుణ్య శిక్షణ, దివ్యాంగజన్ రోజ్‌గార్ సేతు ద్వారా ఉపాధి అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడం జరుగుతోంది అని వాటి గురించి వివరించారు. ఈ రెండు కార్యక్రమాలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంపొందించుకుని స్వయం ఆధారిత జీవనం వైపు ముందుకు సాగాలి అని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా



ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ "వినికిడి లోపం గల వ్యక్తులతో సమర్థవంతమైన సంభాషణకు సంకేత భాష (ప్రత్యేక భాష) కీలకమైన సాధనమని, అయితే సాధారణ ప్రజల్లో సంకేత భాషపై అవగాహన కల్పించుట కొరకు పాఠశాలలు, కళాశాలల్లో ప్రాథమిక సంకేత భాష బోధనకు జిల్లా విద్యా శాఖాధికారి సహకారంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. వినికిడి లోపం గల వ్యక్తులతో సాధారణ విద్యార్థులు, ఉపాధ్యాయులు సమాజంలోని ఇతర వర్గాలు సులభంగా సంభాషించగలిగేలా ప్రాథమిక సంకేత భాషపై అవగాహన కల్పించడం ద్వారా సమగ్ర సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. వినికిడి లోపం ఒక అడ్డంకి కాకుండా, ప్రతి వ్యక్తికి సమాన అవకాశాలు గౌరవంతో జీవించే హక్కు ఉందనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ వైద్య శిబిరంలో ఈ.ఎన్.టీ., ఆడియోమెట్రి, కంటి సంబంధ, మధుమేహ, జనరల్ ఫిజిషియన్, దంత, రక్త సంబంధ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు సంబంధిత మందులు అందించడం జరిగింది.

# చెరువు శిఖం భూమి అన్యాక్రాంతం

- పట్టించుకోని అధికారులు!

జాతీయ రహదారి పక్కనే దర్జాగా ఆక్రమణలు

- 124 సర్వే నంబర్ లో మొరము మట్టి కుప్పలు

తహశీల్దార్‌కు మొరపెట్టుకున్నా శూన్యం

- గ్రామస్తులు, వాహనదారుల ఆగ్రహం



(ఆత్మకూరు - పవర్, సెప్టెంబర్ 27 ): ఆత్మకూరు మండల పరిధిలోని హౌస్ బుజురుగ్ గ్రామంలో ఉన్న జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న చెరువు శిఖం భూమి అక్రమార్కుల పాలవుతోంది. సర్వే నంబర్ 124 లోని ప్రభుత్వ చెరువు శిఖం స్థలాన్ని ఆక్రమించేందుకు కొంతమంది దురాక్రమణదారులు యథేచ్ఛగా మొరము మట్టి కుప్పలు పోస్తూ, స్థలాన్ని చదును చేసుకుంటున్నా అధికారులు కన్నెత్తి కూడా చూడకపోవడంపై గ్రామస్తులు, వాహనదారులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు.

ఈ ఆక్రమణల పర్వంపై గతంలో స్థానిక సర్పంచ్, పాలకవర్గం స్పందించి ఆక్రమణదారులను అక్కడి నుంచి పంపించివేసినప్పటికీ, అక్రమార్కులు మళ్లీ తమ హస్తగతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ విషయమై స్థానిక తహశీల్దార్‌కు పలుమార్లు రాతపూర్వకంగా, మౌఖికంగా విన్నవించినా... అధికారులు కనీసం అటువైపు వచ్చి పరిశీలించిన పాపాన పోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

జాతీయ రహదారికి అతి సమీపంలో విలువైన ప్రభుత్వ భూమి కళ్లముందే అన్యాక్రాంతమవుతున్నా రెవెన్యూ, గ్రామపంచాయతీ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం వెనుక ఉన్న అంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి 124 సర్వే నంబర్ భూమిని సర్వే చేయించి, ఆక్రమణలను తొలగించి, చెరువు శిఖం భూమిని కాపాడాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



# తెలంగాణ ఉద్యమకారులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

**నిజమైన ఉద్యమకారులను గుర్తించి న్యాయం చేస్తామని హామీ**

(హనుమకొండ -- పవర్, సెప్టెంబర్ 27)

తేదీ ఇరవై ఏడు సెప్టెంబర్ రెండు వేల ఇరవై ఆరు ఆదివారం నాడు హనుమకొండ బాలసముద్రంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. వెయ్యి తొమ్మిది వందల తొంభై ఒకటి నుంచి తెలంగాణ కోసం జరిగిన ఉద్యమాల్లో పాల్గొన్న నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన న్యాయం జరిగేలా కృషి చేస్తానని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ బాలసముద్రంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో కాళోజీ తెలంగాణ సంయుక్త కార్యాచరణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు పెద్ది అజయ్ కుమార్, వరంగల్ జిల్లా సంయుక్త కార్యాచరణ కమిటీ అధ్యక్షులు గురుమూర్తి ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు నాయిని మాట్లాడుతూ, తెలంగాణ సాధన కోసం దశాబ్దాలుగా వివిధ దశల్లో ఉద్యమాలు చేసిన ఉద్యమకారుల త్యాగాలను గుర్తు చేసుకున్నారు. తెలంగాణ కోసం పోరాడిన నిజమైన ఉద్యమకారులను గుర్తించి, వారికి తగిన న్యాయం అందించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఉద్యమకారుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలుగు అకాడమీ చైర్మన్ కురపాటి వెంకటనారాయణ, కాళోజీ తెలంగాణ జూనియర్ మహిళా న్యాయవాదుల రాష్ట్ర అధ్యక్షురాలు పెద్ది రాగిణి రాజ్, ఉద్యమకారులు వంగల సదానందం, మల్లికార్జున, కొమురయ్య, రవి, మునిందర్ తదితరులు పాల్గొన్నారు.

## సీరంశెట్టి సుమన్ తండ్రి సంవత్సరికం సందర్భంగా పరామర్శించిన ఫెర్టిలైజర్ డీలర్లు



(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 27) ఆత్మకూరు మండలం హౌస్‌బుజుర్గ్ గ్రామానికి చెందిన లక్ష్మీ ఫెర్టిలైజర్ డీలర్ సీరంశెట్టి సుమన్ తండ్రి సంవత్సరికం సందర్భంగా ఆత్మకూరు ఫెర్టిలైజర్ డీలర్ అసోసియేషన్ సభ్యులు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఫెర్టిలైజర్ అసోసియేషన్ అధ్యక్షులు నర్మేటి రవితేజ, కోశాధికారి వేల్దె రాజు, సభ్యులు కీత రజినీకాంత్, పోతరాజు రాము, యాదండ్ల కుమారస్వామి పాల్గొన్నారు

# ఆత్మకుర్ లో కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు



(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 27)

తెలంగాణ ఉద్యమ నేత, స్వాతంత్ర్య సమరయోధుడు కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఆత్మకూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. పద్మశాలి సంఘం అభ్యున్నతికి ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడుతూ, ఆత్మకూరు మండల పద్మశాలి సంఘం అధ్యక్షులు వెల్దె వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సంఘ అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కుల కోసం, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, సంఘ నాయకులు మరియు సభ్యులు పాల్గొన్నారు.

# స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గానికి 8 కొత్త సబ్ స్టేషన్లు మంజూరు

**రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని తెలిపిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి**

(స్టేషన్ ఘన్‌పూర్ -- పవర్, సెప్టెంబర్ 27)

గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతూ, రైతాంగానికి నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. రఘునాథపల్లి మండలం ఫతేషాపూర్ గ్రామంలో నూతనంగా రూ. 2.45 కోట్ల వ్యయంతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబ్ స్టేషన్‌ను రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. సబ్ స్టేషన్ ఆవరణలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఆయన విద్యుత్ సరఫరాను లాంఛనంగా పునఃప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ, నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతులను పటిష్టం చేయడానికి ప్రత్యేక శ్రద్ధతో పెద్ద ఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. స్టేషన్ ఘన్‌పూర్ నియోజకవర్గ వ్యాప్తంగా విద్యుత్ లో-వోల్టేజ్ సమస్యలను శాశ్వతంగా అధిగమించడానికి 8 కొత్త 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేయించినట్లు వెల్లడించారు. వీటిలో ఫతేషాపూర్‌తో కలిపి 4 సబ్ స్టేషన్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని స్పష్టం చేశారు. మిగిలిన 4 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులు కూడా చివరి దశలో ఉన్నాయని, వాటిని కూడా వేగంగా పూర్తి చేసి అతి త్వరలోనే ప్రజలకు అంకితం చేస్తామని హామీ



ఇచ్చారు.

సబ్ స్టేషన్ల నిర్మాణంతో పంట పొలాలకు సాగునీరు అందించే మోటార్లు కాలిపోకుండా, వోల్టేజ్ సమస్యలు లేకుండా పూర్తిస్థాయిలో నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో నిలపడమే తన ధ్యేయమని, మౌలిక వసతుల కల్పనకు నిరంతరం శ్రమిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మారుజోడు రాంబాబు, స్థానిక సర్పంచ్ సుజాత, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు లింగాల జగదీశ్ చందర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గా? మహేందర్ రెడ్డి, రఘునాథపల్లి మండల ప్రజాప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా ఘనంగా రక్తదాన శిబిరం

**హాజరైన బీజేపీ రాష్ట్ర నాయకులు, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి**

(పరకాల -- పవర్, సెప్టెంబర్ 27)

నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా పరకాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రెడ్ క్రాస్ చైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయచందర్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న ఎంతోమంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉంటుందని తెలిపారు. యువత స్వచ్ఛందంగా ఇలాంటి రక్తదాన కార్యక్రమాల్లో పాల్గొని సమాజ సేవలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సేవా భావంతో నిర్వహించే ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మానవతా విలువలను మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా యువజన మోర్చా జిల్లా అధ్యక్షులు పున్నం వేణు, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేవునూరి మేఘనాథ్, ఆర్.పీ. జయంత్ లాల్, గురజాల శ్రీరామ్ రెడ్డి, దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్, ములక ప్రసాద్, బత్తుల సుమంత్, నడికూడ మండల నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలు

**ఘనంగా నివాళులర్పించిన భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్**

(భూపాలపల్లి -- పవర్, సెప్టెంబర్ 27)

ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రజా సేవ మరియు సామాజిక న్యాయం కోసం జీవితాన్ని అంకితం చేసిన కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయమని



పేర్కొన్నారు. స్వాతంత్ర్యోద్యమంతో పాటు తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ఆయన చేసిన పోరాటం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు. నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజల కోసం జీవించిన బాపూజీ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్, ఆర్ఐ రత్నం, పోలీసు సిబ్బంది మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ పురస్కార ప్రదానం

**మహానంది అవార్డు అందుకున్న పరకాల తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారి**

(పరకాల -- పవర్, సెప్టెంబర్ 27)



సామాజిక సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకు గాను హనుమకొండ జిల్లా పరకాల మున్సిపాలిటీ పరిధిలోని తొమ్మిదవ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారికి జాతీయ స్థాయి అరుదైన గౌరవం దక్కింది. తెలుగు వెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో ఆయనకు 'మహానంది జాతీయ పురస్కారం-2026'ను ఘనంగా బహూకరించారు. సమాజంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న ప్రతిభావంతులను గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణచారికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు స్థానిక ప్రజలు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఆయన మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆకాంక్షించారు.

## కాకతీయ ఓటీ మరియు ఏటీ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ వేడుకలు

**ఘనంగా నిర్వహించిన అసోసియేషన్ సభ్యులు మరియు వైద్య రంగ ప్రతినిధులు**

(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 27)

కాకతీయ ఓటీ మరియు ఏటీ అసోసియేషన్ మూడో వార్షికోత్సవ వేడుకలను ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఓటీ మరియు ఏటీ టెక్నీషియన్లు, వైద్య రంగ ప్రతినిధులు, శ్రేయోభిలాషులు మరియు ఆహ్వానితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ, గత మూడు సంవత్సరాలుగా ఓటీ మరియు ఏటీ టెక్నీషియన్ల ఐక్యత, సంక్షేమం మరియు వృత్తిపరమైన అభివృద్ధి కోసం అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు, వారి హక్కులు మరియు వృత్తి అభివృద్ధికి అవసరమైన




కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఈ రంగంలో పనిచేస్తున్న సిబ్బందికి మరింత మెరుగైన అవకాశాలు, వృత్తిపరమైన గుర్తింపు మరియు సంక్షేమం కల్పించేందుకు భవిష్యత్తులో కూడా ఐక్యంగా కృషి చేస్తామని అసోసియేషన్ నాయకులు స్పష్టం చేశారు. మూడో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని అసోసియేషన్ అభివృద్ధికి కృషి చేసిన సభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం అసోసియేషన్ భవిష్యత్ కార్యాచరణ, సభ్యుల సంక్షేమం మరియు ఈ రంగం అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. రాబోయే రోజుల్లో సభ్యులందరినీ కలుపుకుని మరిన్ని సంక్షేమ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, అసోసియేషన్ బలోపేతానికి ప్రతి సభ్యుడు సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు శ్రీనివాస్ బైరోజు, అధ్యక్షులు నల్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి గుగులోతు రాజు, కోశాధికారి రమేష్ గౌడ్, ఇతర కార్యవర్గ సభ్యులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**తెలంగాణ సాధన కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకం - వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్**

(వరంగల్ -- పవర్, సెప్టెంబర్ 27)



తెలంగాణ సాధన, సామాజిక న్యాయం కోసం కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన పోరాటం ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మహమ్మద్ అయూబ్ పేర్కొన్నారు. బాపూజీ జయంతి సందర్భంగా వరంగల్ గోపాల్‌స్వామి గుడి జంక్షన్‌లోని ఆయన విగ్రహానికి మహమ్మద్ అయూబ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి, కుడా (ఖఖణాా) చైర్ పర్సన్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్య శారద తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహమ్మద్ అయూబ్ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సామాజిక న్యాయం కోసం బాపూజీ చేసిన కృషి నేటి తరానికి ఎంతో ఆదర్శమని కొనియాడారు. రాష్ట్ర సాధన కోసం ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు.

## ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**పాడి గేదెలను పరిశీలించి లబ్ధిదారులకు సూచనలు చేసిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి**

(ఆత్మకూరు -- పవర్, సెప్టెంబర్ 27)

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం నాగయ్యపల్లి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన పాడి గేదెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి వారికి పలు సూచనలు చేశారు. పాడి గేదెల పెంపకం ద్వారా లబ్ధిదారులు నిరంతర ఆదాయం పొందుతూ తమ కుటుంబాల ఆర్థిక పరిస్థితిని



మెరుగుపరుచుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ప్రతి కుటుంబం ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు విశేషంగా కృషి చేస్తున్నారని అన్నారు. ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగడమే లక్ష్యంగా దామెరలో మహిళలతో పరకాల ఇందిరా మహిళా డైరీని ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. లబ్ధిదారులు పాడి గేదెలను సక్రమంగా సంరక్షిస్తూ, పాల ఉత్పత్తిని పెంచుకొని అదనపు ఆదాయం పొందాలని పిలుపునిచ్చారు.





# జిమ్‌లో అనసూయ

### కొత్త హెయిర్‌స్టైల్‌తో కొంటె చూపులు

బుల్లితెర యాంకర్‌గా తనదైన గళంతో అలరించి, వెండితెరపై నటిగా మెప్పిస్తున్న అనసూయ భరద్వాజ్ తాజాగా షేర్ చేసిన జిమ్ సెల్ఫీలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కొత్త షార్ట్ వేవీ హెయిర్‌స్టైల్‌తో చెమటతో మెరుస్తూ కనిపించిన ఆమె ఫొటోలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. జిమ్ లుక్‌లో అనసూయ అడిడాస్ ఆప్టైమ్ ట్రైనింగ్ ఫ్లవర్ టైట్స్, బ్లాక్ స్పోర్ట్స్ బ్రా, ఫింగర్‌లెస్ జిమ్ గ్లోవ్స్ ధరించింది. కొత్త హెయిర్‌స్టైల్‌తో కెమెరా వైపు చూస్తూ కన్నుగీటిన ఫొటోలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ ఫొటోలను షేర్ చేస్తూ 'ఈ రోజు మీరు వర్కౌట్ చేశారా? హెయిర్‌స్టైల్ మార్చాను.. కానీ నాలోని ఫైర్ అలాగే ఉంది' అంటూ అనసూయ క్యాప్షన్ ఇచ్చింది. దీంతో అభిమానులు 'అమేజింగ్', 'నైస్', 'ఇగ్నైటెడ్ ఎనర్జీ' అంటూ కామెంట్లు చేస్తున్నారు.

# టాలీవుడ్‌లో గ్యాప్.. కోలీవుడ్‌లో జోరు

### ఇతర భాషా చిత్రాలతో బిజీ



'సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు' చిత్రంలో అమాయకమైన, సహజసిద్ధమైన నటనతో తెలుగు ప్రేక్షకులకు చేరువై.. 'తెలుగింటి సీతమ్మ'గా గుర్తింపు తెచ్చుకున్న నటి అంజలి. తెలుగు నటీమణులకు అవకాశాలు అంతగా దక్కని టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకుని స్టార్ హీరోయిన్ల సరసన నిలిచిన అతి కొద్దిమంది తెలుగు భామల్లో అంజలి ఒకరు. అయితే కొంతకాలంగా అంజలి టాలీవుడ్ తెరపై పెద్దగా కనిపించకపోవడంతో.. ఆమె తెలుగు సినిమాలకు పూర్తిగా దూరమయ్యారా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు ప్రాజెక్టులు లేకపోవడం ఈ అనుమానాలకు మరింత బలం చేకూరుస్తోంది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా.. నటనకు ఆస్కారం ఉన్న విభిన్నమైన పాత్రలను ఎంచుకోవడంలో అంజలికి ప్రత్యేక గుర్తింపు ఉంది. అలాంటి పాత్రలకు సరిపడే కథలు, అవకాశాలు టాలీవుడ్‌లో తగ్గిపోవడం కూడా ఆమె ఇక్కడ పెద్దగా కనిపించకపోవడానికి ఓ కారణం కావచ్చనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయితే టాలీవుడ్‌లో కాస్త సైలెంట్‌గా ఉన్నప్పటికీ.. తమిళం, మలయాళ చిత్ర పరిశ్రమల్లో మాత్రం అంజలి బిజీగానే కొనసాగుతున్నారు. కోలీవుడ్‌లో ఆమెకు వరుసగా అవకాశాలు వస్తుండగా.. నటనకు ప్రాధాన్యమున్న వైవిధ్యమైన, బలమైన పాత్రలను దర్శకులు ఆమె కోసం ఎంపిక చేస్తున్నారు. మలయాళంలోనూ విమర్శకుల ప్రశంసలు అందుకునే సినిమాలు, వెబ్ సిరీస్‌లలో కీలక పాత్రలు పోషిస్తూ తనదైన ముద్ర వేస్తున్నారు.

Malavika Mohanan



### పింక్ శారీలో ఆకట్టుకుంటున్న

# అందాల భామ

- సంప్రదాయ లుక్‌లో మెరిసిన మాళవిక
- సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలు
- నెటిజన్లను ఆకట్టుకుంటున్న హీరోయిన్ లుక్

హీరోయిన్ మాళవిక మోహనన్ మరోసారి తన అందంతో అభిమానులను ఆకట్టుకున్నారు. తాజాగా పింక్ చీరలో సంప్రదాయ లుక్‌లో ఉన్న ఫొటోలను ఆమె సోషల్ మీడియాలో షేర్ చేశారు. చీరకట్టులో ఎంతో అందంగా, హుందాగా కనిపిస్తున్న మాళవిక ఫొటోలు ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారాయి. పింక్ శారీలో మెరిసిన మాళవిక మోహనన్ లుక్ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సంప్రదాయ ఆభరణాలు, చీరకు తగిన స్టైలింగ్‌తో ఆమె ఫొటోలకు మరింత ఆకర్షణ వచ్చింది. ఈ ఫొటోలను చూసిన నెటిజన్లు మాళవిక అందాన్ని ప్రశంసిస్తూ కామెంట్లు చేస్తున్నారు. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ యాక్టివ్‌గా ఉండే మాళవిక.. ఎప్పటికప్పుడు తన ఫొటోషూట్‌లకు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటుంటారు. తాజాగా షేర్ చేసిన ఈ పింక్ శారీ ఫొటోలు కూడా అభిమానుల దృష్టిని ఆకర్షిస్తూ వైరల్‌గా మారాయి.

# బ్లాక్ స్కిన్‌టైట్ డ్రెస్‌లో తాప్సీ

### అదరగొడుతున్న ఫ్యాషన్ స్టైల్



టాలీవుడ్ నుంచి బాలీవుడ్‌కు వెళ్లి అక్కడ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక తాప్సీ పన్ను. తెలుగులో వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత బాలీవుడ్‌లోకి అడుగుపెట్టి విభిన్నమైన కథలు, పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా వరుస ప్రాజెక్టులతో బిజీగా కొనసాగుతోంది. కెరీర్‌లో గ్లామర్ పాత్రలతో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు కూడా చేస్తూ మెప్పిస్తున్న తాప్సీ.. సోషల్ మీడియాలోనూ తరచూ తన ఫొటోలు, వీడియోలతో సందడి చేస్తుంటుంది. తాజాగా మరోసారి తన స్టైలిష్ లుక్‌తో అభిమానుల దృష్టిని ఆకర్షించింది. బ్లాక్ స్కిన్‌టైట్ డ్రెస్‌లో ఫొటోలకు పోజులిచ్చిన తాప్సీ.. తన ఫ్యాషన్ స్టైల్‌తో ఆకట్టుకుంది. ఈ ఫొటోల్లో ఆమె కాన్ఫిడెంట్ లుక్, స్టైలిష్ అప్పీల్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలిచాయి. సింపుల్ మేకప్, చక్కటి హెయిర్‌స్టైల్‌తో తాప్సీ ఇచ్చిన పోజులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. తాప్సీ ఫొటోలు చూసిన నెటిజన్లు ఆమె లుక్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు. సినిమాలతోనే కాకుండా తన ఫ్యాషన్ స్టేట్‌మెంట్స్‌తోనూ తరచూ వార్తల్లో నిలిచే ఈ భామ.. తాజాగా మరోసారి తన స్టైల్‌తో ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంది.

# దివి స్టైలిష్ ట్రీట్

### చిరిగిన జీన్స్.. టీ షర్ట్ దివి కొత్త లుక్



నటి, బిగ్‌బాస్ ఫేమ్ దివి తాజాగా తన స్టైలిష్ లుక్‌తో అభిమానులను ఆకట్టుకుంది. చిరిగిన జీన్స్, టీషర్ట్ ధరించి ఫొటోషూట్‌కు పోజులిచ్చింది. క్యాజువల్ అవుట్‌ఫిట్‌లోనూ తన గ్లామర్‌తో ప్రత్యేకంగా కనిపిస్తూ కెమెరా ముందు సందడి చేసింది. విభిన్న పోజుల్లో దివి ఇచ్చిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఆమె లుక్, స్టైల్‌కు అభిమానుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఫొటోలను చూసిన నెటిజన్లు తమదైన శైలిలో కామెంట్లు చేస్తూ ప్రశంసిస్తున్నారు. తాజాగా దివి షేర్ చేసిన ఈ పిక్స్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి.

# ఫరియా గ్లామర్ జోష్

- సిగ్మా వేడుకలో జాతిరత్నం
- అందరినీ ఆకట్టుకున్న ఫరియా

'జాతిరత్నాలు' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన నటి ఫరియా అబ్దుల్లా మరోసారి సందడి చేసింది. తాజాగా 'సిగ్మా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఈ ముద్దుగుమ్మ.. తన స్టైలిష్ లుక్‌తో అందరి దృష్టిని ఆకర్షించింది. ఈ సందర్భంగా ఫరియా చేసిన సందడి, ఫొటోలకు ఇచ్చిన పోజులు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. 'సిగ్మా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఫరియా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొంటూ అభిమానులను అలరించింది. కెమెరాల ముందు స్టైలిష్‌గా పోజులిస్తూ సందడి చేయడంతో ఈవెంట్‌లో ఆమె సందడి హైలైట్‌గా నిలిచింది. ఇక ఈ ఈవెంట్‌కు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలోకి రావడంతో నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఫరియా లుక్, ఆమె ఇచ్చిన పోజులు ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటున్నాయి. దీంతో ఈ ఫొటోలను అభిమానులు తెగ షేర్ చేస్తున్నారు. నటనతో పాటు తన ప్రత్యేకమైన యాటిట్యూడ్, ఎనర్జిటిక్ పర్సనాలిటీతో గుర్తింపు తెచ్చుకున్న ఫరియా.. సినిమా ఈవెంట్లలోనూ తనదైన శైలిలో సందడి చేస్తుంటుంది. తాజాగా 'సిగ్మా' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లోనూ అదే జోష్‌తో కనిపించి మరోసారి వార్తల్లో నిలిచింది.

